# కానుక

ఫాల్గుణ మాసం వచ్చింది.

చెట్లు చేమలు కొత్త చైతన్యంతో తొణికిసలాడుతున్నాయి. కొమ్మలు వయ్యారంగా ఊగుతున్నాయి. మల్లెలు, చేమంతులు విరగబూస్తున్నాయి. మామిడిపూత సౌరభం మత్తు గొలుపుతూ ఉంది. కోకిల గొంతు సవరించుకుని 'కుహూ' 'కుహూ' అంటూ కొత్త రాగాలు ఆలపిస్తూ రాబోయే చైత్రమాసంలో సంగీత కచ్చేరీ పెట్టడానికి సిద్ధమవుతూ ఉంది.

చెరుకు నరకడం, మినుముల నూర్పిడి పూర్తయ్యాయి. పెద్దగా పొలం పనులు ఏమీ లేని రోజులవి.

పశువుల సావిడిలో నుంచి పాడి గేదెను, చూడి గేదెను తీసుకువచ్చి మామిడిచెట్టు నీడలో ఉన్న కట్టుకొయ్యలకు కట్టేశాడు. చలమయ్య. ఎడ్లను కూడా తీసుకొస్తూ మామిడి చెట్టుకేసి చూశాడు.

చెట్టు నిండా గుత్తులు, గుత్తులుగా మామిడిపూతే. ఆ పూతలోని తేనె కోసం తేనెటీగలు పోటీ పడుతున్నాయి.

'ఉగాది నాటికి ఈ చెట్టు పిందెలతో కొత్త బట్టలేసుకున్నట్లు కళకళ లాడుతూ ఉంటుంది' అనుకున్నాడు మనస్సులో చలమయ్య.

రేకు డబ్బాతో తవుడు తీసుకొచ్చి గాబులో కుడితి కలిపే ప్రయత్నంలో ఉండిపోయాడు.

చలమయ్యకి అవరయేళ్లు. ఆరడుగుల భారీ విగ్రహం. దిట్టంగా పొలం పనులు చేస్తూ ఉండటంతో రాటుదేలిన శరీరం. పెద్ద మీసాలు ముఖానికి గంభీరతను తెచ్చాయి. విశాలమైన రొమ్ము మీద దట్టంగా వెంట్రుకలు.

కట్టుకున్న పంచె ఎగలాక్కుని పంచె అంచు బొడ్లో దోపుకొని పాడి గేదె పలుపు విప్పి కుడితి తాగించడానికి తీసుకువచ్చాడు.

రోడ్డు మీద పచ్చగడ్డి మోపు నెత్తి మీద పెట్టుకుని వెళ్తున్న సాంబయ్య కనిపించాడు.

"ఏరా... పెద్ద మోపు నెత్తి మీద పెట్టుకొస్తున్నావ్?... అర్ధరాత్రే పొలం గట్ల మీద పడ్డావా ఏమిటి... ఎనిమిది కాకుండానే తిరిగొచ్చేసేవ్" అంటూ సాంబయ్యను పలుకరించాడు చలమయ్య.

"తప్పదుగా మావా! నలుగురు ఆడపిల్లల తండ్రిని... రెక్కలు ముక్కలు చేసుకుంటేగాని వాళ్లని ఒడ్డెక్కించలేను." నెత్తి మీద మోపుతో రోడ్డు మీదే నిలబడి అన్నాడు సాంబయ్య.

కాఫీ గ్లాసుతో ఇంట్లో నుంచి బయటికొచ్చింది బసవమ్మ.

రోడ్డు మీద నిలబడ్డ సాంబయ్యను చూసి "లోపలికిరా అల్లుడూ... కాఫీ తాగి వెళ్దువుగాని" అంది బసవమ్మ.

"వద్దులే అత్తా... మొహం కూడా కడుక్కోలేదు" అన్నాడు సాంబయ్య.

"గడ్డి మోపు అరుగు మీద పడేసి లోపలికి రారా... ఇంట్లో పాలన్నీ తీసుకెళ్లి పట్నంలో అమ్ముకుంటావ్. నువ్వు కాఫీ తాగి ఎన్ని సంవత్సరాలయిందో?"

"నీ వన్నీ చతుర్లు మావా... ఇంట్లో కాఫీకి, పెరుక్కి పాలు అట్టిపెట్టుకోకుండా పాలన్నీ అమ్ముకుంటానా ఏంది?"

గడ్డి మోపు అరుగు మీద పడేసి వసారాలో వచ్చి కూర్చున్నాడు సాంబయ్య. వేపపుల్ల తెచ్చి ఇచ్చాడు చలమయ్య సాంబయ్యకి.

ఇత్తడి చెంబుతో నీళ్ళు తెచ్చి ఇచ్చింది బసవమ్మ.

గబగబా వేపపుల్ల నమిలేసి తపుక్కున ఉమ్మి నీళ్లతో మొహం కడుక్కున్నాడు. పై పంచెతో మొహం తుడుచుకుని మళ్లీ వసారాలోకి వచ్చి మంచం మీద కూర్చున్నాడు.

కట్టు గొయ్య ఊడబెరుక్కుని కుడితి గాబు దగ్గరికి పరుగెత్తుకొచ్చింది ఎద్దు. చూడి గేదె బెదిరి దూరంగా జరిగింది.

"ఓహో... హెూవ్... హెూవ్... ఓసీ నీ... నీ దంతా ఆత్రమేనే ! ముట్టె పొగరు ఎక్కువ." ఎద్దును అదిలించి దాన్ని తీసుకెళ్లి వేపచెట్టుకు కట్టేశాడు.

గుమ్మం దగ్గర నిలబడ్డ బసవమ్మ కళ్లు చెమ్మగిల్లాయి.

"మేనకోడలిని కాదని తనకి నచ్చిన అమ్మాయిని చేసుకున్నాడు... మే మేం కాదని అనలేదుగా... చేసుకోవద్దని చెప్పలేదు... వాడికి ఏది నచ్చితే అది చేసేస్తాడు. మరొకరు చెప్పింది వినడు. చిన్నప్పటి నుంచి వాడి గుణ మంతే ! ఆ అమ్మాయి రానివ్వలేదేమో! ఎనిమిదేళ్లు వాడిని అక్కడే కట్టిపడేసింది" అంది బసవమ్మ.

"అనవసరంగా ఆ పిల్లను ఆడిపోసుకోకు. నీ కొడుకు గట్టిగా రావాలనుకుంటే ఆ పిల్ల ఆపగల్గుతుందా? వాడు రాకపోయినంత మాత్రాన మన గుండెలేం ఆగిపోలేదు ! ఇక్కడ పంటలు పండక మానలేదు. చెట్లు కాయలు కాయకుండా మానుకున్నాయా?" తల ఎగరేస్తూ అన్నాడు చలమయ్య.

సాంబయ్యతో పైకి అలా అన్నాడేగాని ఎనిమిదేళ్లలో కొడుకు ఒక్కసారి కూడా రాలేదని మథనపడని రోజు లేదు.

" మీ కెటూ ఇక్కడ ఏ బాదరబందీ లేదు. కొడుకుతో పాటే అమెరికా వెళ్లిపోకూడదూ!' ' అనేసి నాలి కరుచుకున్నాడు సాంబయ్య.

"మా ముత్తాత ఇక్కడే పుట్టి, పెరిగి పంటలు పండించి ఇక్కడి మట్టిలోనే కలిసిపోయాడు. మా తాత, నాన్నలు కూడా ఇక్కడే పుట్టి పెరిగి చెమటలు చిందించి బంగారం లాంటి పంటలు పండిచి; నలుగురి చేత 'సెహబాష్' అనిపించుకున్నారు... నేనూ ఈ మట్టిలోనే కలిసిపోవాలి!" అన్నాడు చలమయ్య ఆవేశంగా.

"ఇప్పుడెందుకులే ఆ మాటలన్నీ, కోడల్ని మనవడిని తీసుకొస్తున్నట్లు ఉత్తరంలో రాశాడు మా వాడు. సాయంత్రం వచ్చి అందరినీ చూసివెళ్లు అల్లుడూ" అంది బసవమ్మ.

"మీ అబ్బాయి ఎప్పుడొస్తే అప్పుడు పరుగెత్తుకురానూ... వాడిని చిన్నప్పుడు ఎత్తుకుని ఆడించాను. నాకు మాత్రం వాడిని చూడాలనిలేదూ!" అనేసి అరుగు మీద పచ్చగడ్డి మోపు నెత్తి కెక్కించుకుని అక్కడ నుంచి కదిలేడు సాంబయ్య.

సాయంత్రం నాలుగు గంటలప్పుడు ఇంటి ముందు కారు వచ్చి ఆగింది.

కారు శబ్దం విని హాల్లో పడుకున్న బసవమ్మ జుట్టు ముడి విడిపోయినా పట్టించుకోకుండా వచ్చింది. వసారాలో గచ్చు మీద చతికిలబడి గోగునారతో తాడు పేనుతున్న చలమయ్య రోడ్డు వైపు ఒకసారి తేరిపార చూసి, మళ్లీ తాడు పేనడంలో మునిగిపోయాడు.

కార్లో నుంచి దిగుతున్న ప్రసాద్‌ని చూసి ఆనందంతో ఊగిపోయింది.

కొడుకు దగ్గర కొచ్చి భుజాలు నిమిరింది.

నన్నగా, పీలగా ఉండే కొడుకు రంగుదేలి బాగా ఒళ్లు వచ్చి కంటికి నిండుగా కనిపించడంతో కోడలు పోషణ బాగానే ఉందన్నమాట' అనుకుంది మనస్సులో.

కార్లో నుంచి బయటపడ్డ ఆపిల్ లాంటి ఏడేళ్ల కుర్రాడు తండ్రి వంక, తండ్రి పక్కన నిలబడ్డ ముసలావిడ వైపు కళ్లు విప్పార్చుకుని మార్చి, మార్చి చూస్తున్నాడు.

"మీ నాయనమ్మరా... గ్రాండ్‌మా" అన్నాడు ప్రసాద్ కొడుకుతో.

మనవడు నాయనమ్మకు చుట్టుకుపోయాడు. వాడి నుదుటి మీద పడుతున్న జుట్టును వెనక్కు తోసి నుదురు మీద, బుగ్గల మీద ముద్దుల వర్షం కురిపించింది. పగలబడి నవ్వడం మొదలెట్టాడు మనవడు.

బసవమ్మ పొయ్యి దగ్గర నుండి రావడంతో మొహం నిండా మసి అయ్యింది. అది చూసే మనవడు నవ్వడం.

"నాయనమ్మ మొహం చూడమ్మా!" కార్లో నుంచి దిగిన తల్లికి చెప్పబోయాడు.

"తప్పు... అలా అనకూడదు." కొడుకును మందలించింది.

కోడలిపై బసవమ్మ దృష్టి పడింది.

మెరుగులు దిద్దిన బొమ్మలా - గుండ్రటి మొహం, పెద్ద కళ్లు, గులాబీ రంగులో ఉన్న రంగు చీర ఆ అమ్మాయి సౌందర్యాన్ని ఇనుమడింపచేస్తూ ఉంది.

కోడలిని పలుకరించకూడదనుకుంది కానీ మనస్సు ఆగలేదు కోడలిని చూడగానే.

కోడలి దగ్గర కెళ్లి బుగ్గలు నిమిరి ఆమె చెయ్యి పట్టుకుని నిలబడిపోయింది.

ప్రసాద్ లగేజీ ఇంట్లో చేర్చి టాక్సీని తిరగి పంపించాడు.

"నాన్న పలుకరించలేదు... కోపం తగ్గలేదా ఏమిటి?" తల్లిని అడిగాడు ప్రసాద్.

"ఆయనకి నీ మీద కోపం ఏమిట్రా? నువ్వు ఇక్కడికి రావడంలేదనే బాధకంటే, తన అనంతరం ఈ ఇల్లు, వ్యవసాయం చూసుకోవడానికి తన వాళ్లంటూ ఎవ్వరూ ఇక్కడ ఉండరనే

బాధే ఎక్కువాయనకి. సర్లే! లోపలికి పద స్నానం చేద్దువుగాని.” కొడుకు చెయ్యి పట్టుకుని లోపలికి తీసుకు వెళ్లింది.

తాత దగ్గర చేరాడు మనవడు.

తాడు పేనడాన్ని విచిత్రంగా చూస్తూ ఉండిపోయాడు.

“నీ పేరేమిట్రా?”

“మా నాన్న ఉత్తరంలో నా పేరు రాయలేదా?” గోగునార తీసుకుని తనూ మెలిపెట్టే ప్రయత్నం చేస్తూ.

“మాకేం గుర్తుంటాయిరా...

“మణిదీప్”

“నా కా పేరు నోరు తిరగదురా... మా నాన్న పేరు ‘మంగయ్య’... ఆ పేరుతో నిన్ను పిలుస్తా?”

“నీ ఇష్టం తాతయ్యా” అన్నాడు. మణిదీప్.

ఇంటి ముందు చెంగు చెంగున గంతులేస్తున్న లేగదూడ మీద వాడి దృష్టి పడింది. దాని వెనుకే పరుగెత్తాడు. వాడికి చిక్కకుండా ముప్పతిప్పలు పెట్టి చివరికి నిలబడిపోయింది. లేగదూడని నిమురుతూ ఉంటే మణిదీప్ కళ్లు మెరిశాయి ఆనందంతో. పట్టులా మృదువుగా, సున్నితంగా తగిలింది లేగదూడ వొళ్లు.

లేగదూడ నాలికతో మణిదీప్ బుగ్గలు నాకడం మొదలుపెట్టింది. దాని నాలుక గరుగ్గా తగులుతున్నా లేగదూడను పక్కకు నెట్టెయ్యకుండా అలాగే కూర్చుండి పోయాడు.

కత్తితో కొబ్బరికాయలు చెక్కి నీళ్ల గ్లాసులో పోసి అందరికి ఇచ్చాడు చలమయ్య.

“కూల్ డ్రింక్ కంటే కొబ్బరి నీళ్లే బాగున్నాయి తాతయ్యా” అన్నాడు మణిదీప్.

స్నానం చెయ్యడానికి పెరట్లో బావి దగ్గర చేరాడు మణిదీప్.

☆ ☆ ☆

బావి నీళ్లు కొంచెం ఉప్పగా ఉంటాయి. ఇంట్లో వాడకానికి బావి నీళ్లే ఉపయోగిస్తారు. మంచినీళ్లు మాత్రం చెరువు దగ్గరకెళ్లి తెచ్చుకోవాల్సిందే.

బొక్కెనతో నీళ్లు తోడుతూ ఉంది బసవమ్మ. "నీళ్లు నేను తోడతాను నాయనమ్మా?"

"నువ్వెందుకులేరా... ఆ గంగాళంలో నీళ్లున్నాయి – నువ్వు స్నానం చెయ్యి.

గంగాళం, భోషాణం, పందిరి మంచం, కావిడిపెట్టే, ఇత్తడి బిందే – ఆ మాటలన్నీ కొత్తగా ఉన్నాయి వాడికి. నాయనమ్మకు అడిగి ఏయే వస్తువును ఏం పేరుతో పిలుస్తారో వివరంగా తెలుసుకునేవాడు.

మణిదీప్ నీళ్లు తోడుతుంటే చేయి జారిబొక్కెన బావిలో పడిపోయింది.

నాయనమ్మ తిడుతుందేమోనని భయపడిపోయాడు.

"మీ తాతయ్య ఎవరి చేతన్నా బావిలోపడిన బొక్కెన బయటకు తీయిస్తారుగాని... నువ్వు స్నానం చెయ్యి" అనేసింది బసవమ్మ.

మణిదీప్ మనస్సు తేలికపడింది.

రేణుక వచ్చింది పెరట్లోకి కూతుర్ని వెంటేసుకుని.

బసవమ్మ తమ్ముడి కూతురే రేణుక. ఆ అమ్మాయినే కొడుక్కి చేసుకోవాలనుకుంది బసవమ్మ.

"అక్కకి అసలు గర్వం లేదత్తయ్యా! అందరితో కలుపుగోలుగా మాట్లాడుతుంది. అక్కని చూస్తూ డాక్టరని ఎవ్వరూ అనుకోరు. బావ, అక్కయ్య ఒకే ఆసుపత్రిలో పనిచేస్తున్నారట. లక్షలు, లక్షలు సంపాదిస్తున్నారట. బావంటే అక్కకి ప్రాణం... నా కంటే అన్ని విధాలా మంచి అమ్మాయినే చేసుకున్నాడు." ప్రసాదు భార్య మాధురి గూర్చి చెప్పుకుపోతూనే ఉంది రేణుక.

రేణుక కూతురు ఐదేళ్ల రమ మణిదీప్‌తో మాటలు కలిపే ప్రయత్నం చేస్తూంది.

తను స్నానం చేస్తుంటే ఆ అమ్మాయి అక్కడ నిలబడటం మణిదీప్‌కు నచ్చలేదు. కోపంగా రమ వైపు చూస్తూ ఇంట్లోకి వెళ్లమని కళ్లతోనే ఆజ్ఞాపిస్తున్నాడు. పెంకిపిల్ల రమ లెఖ్ఖ చెయ్యడంలేదు మణిదీప్ సైగల్ని.

మణిదీప్ కట్టుకున్న తువ్వాలు ఊడబెరికి పిట్టలా ఇంట్లోకి తుర్రు మంది.

అది చూసి నవ్వు ఆపుకోలేకపోయింది బసవమ్మ. కిందపడిన తువ్వాలును మళ్లీ మొలకి చుట్టుకున్నాడు మణిదీప్.

"రేణుకా ! మీ బావ పిలుస్తున్నాడు అమెరికా నుంచి నీకు ఇవ్వడానికి 'ఏదో గిఫ్ట్' తెచ్చాడు" అంది మాధురి పెరట్లోకి వచ్చి.

"ఆ గిఫ్ట్ ఏమిటో నీకు తెలియదా ఏమిటి? నీకు తెలియకుండా మా బావ నా కోసం తెచ్చాడా?" అడిగింది రేణుక.

నవ్వుతూ తలూపింది మాధురి.

హాల్లోకి వచ్చారు ఇద్దరూ.

ముచ్చటైన పతకమున్న బంగారు గొలుసు. రమకి బహుమతిగా ఇచ్చాడు. నచ్చినవి చేయించుకోవడానికి వీలుగా బంగారం బిస్కెట్ కూడా ఇచ్చాడు ప్రసాద్ రేణుకకు.

చుట్టా లందరికీ రకరకాల బహుమతులు పంచాడు ప్రసాద్. చలమయ్యగారి కోడలిని చూసి వెళ్లడానికి రోజూ ఊళ్లోని ఆడవాళ్లు వచ్చిపోతూనే ఉన్నారు.

☆ ☆ ☆

గడ్డివాములో నుండి ఎండుగడ్డి, జనుపకట్టె దూసి పశువుల సావిడిలోని గేదెలకు, ఎడ్లకు, ఆవుకు వేశాడు చలమయ్య.

తాత వెనుకే తను దూసిన ఎండుగడ్డి తెచ్చి లేగదూడకి, పెయ్యి దూడకి వేశాడు మణిదీప్.

"ఏం మావా! ఈ మనవడి క్కూడ పశువుల్ని మేపడం ఎలాగో నేర్పుతున్నావా? వ్యవసాయ పనులు కూడా నేర్పు నీ చేతికి అందివస్తాడు." అప్పుడే వచ్చిన సాంబయ్య అన్నాడు.

"నాలుగు రోజులు ఉండిపోయేవాడికి ఏం వ్యవసాయం పనులు నేర్పుతాములే ! రేపు అమెరికా వెళితే గడ్డివాము కనపడదు, లేగదూడ కనబడదు వాడికి" అన్నాడు చలమయ్య.

ఒక క్షణం ఆగి మళ్లీ మనవడి గూర్చి చెప్పుకుపోయాడు.

"వీడసలు ఇక్కడికి రాకుండా ఉంటే బాగుండేదయ్యా... ఈ నాలుగు రోజులలోనే వీడి మీద ఆపేక్ష పెంచుకున్నాను. వీడు కూడా ఒక్క క్షణం నన్నొదిలి ఉండటం లేదు. నేను ఏ పని చేస్తే వాడూ అదే పని చేస్తానంటాడు. పొలం బయలుదేరితే వాడూ వెంటబడి వస్తున్నాడు. వాడిని చూస్తుంటే మా తాతగారు మళ్లీ జన్మ ఎత్తి కళ్లముందు తిరుగుతున్నాడనిపిస్తుంది. ఆయన క్కూడా వ్యవసాయమంటే పంచప్రాణాలు."

చెయ్యనందుకు, మనిషి బ్రతుకు మంచి గంధం చెక్కలు అరిగిపోయి సువాసనలు వెదజల్లి నలుగురికి ఉపయోగపడి కనుమరుగై పోవాలని చెప్పినందుకు నాన్నంటే అంత ఇష్టం - కథ రాయడానికి ప్రేరణ మా నాన్నే!

చిన్నప్పుడు ఆర్చీ ఇంటి ముందు మెట్ల మీద వెన్నెల్లో కూర్చునేవాళ్ళం. పిల్లలందరం మా కంటే నాలుగేళ్ళు పెద్దదయిన రంగవర్థని అక్కయ్య చుట్టూచేరి ఆమె చెప్పె కథలుల కబుర్లు వినేవాళ్ళం. ఆ కథలు, కబుర్లు ఇప్పడు గుర్తులేక పోయినా సరస్వతి దేవిలా బంగారు బొమ్మలా మెట్లమీద వెన్నెట్లో చెప్పిన కబుర్లే నాకు కథలు చెప్పడానికి స్ఫూర్తి నిచ్చాయి. 'భాషా ప్రవీణ' చదివింది అక్కయ్య. ఇంట్లో అమరకోశం, కౌముది, భారత రామాయణ గ్రంధాలు వుండేవి. పెళ్ళయ్యాక పిల్లలు, సంసారం గొడవల్లో ఆ చదువంతా మర్చి పోయింది అక్కయ్య.

మా వూళ్ళో ప్రముఖ పండితులు వుండేవారు. కొండవీటి వెంటకకవి, చల్లా పిచ్చయ్యశాస్త్రి, సత్యనారాయణ చౌదరి, చిన్నం రామయ్య గారు వుండేవారు. వారు నాన్నకు మిత్రులు. కొన్ని రోజులు కొసరాజు రాఘవయ్య చౌదరి మావూళ్లో మా ఇంటికి దగ్గర వుండేవారు. సినిమాల్లో పాటలు రాయడానికి మద్రాసు వెళ్ళి పోయాడు. ఆయన సిఫార్సుతో మా మంగారావు అన్నయ్యకు రైల్వేలో ఉద్యోగం వొచ్చింది. కేరళ, తమిళనాడులో పనిచేసేవాడు. ఆరు ఏడు తారీఖుల కల్లా ఆయన దగ్గర నుంచి వంద రూపాయిల మనియార్డరు వొచ్చేది. అదే ఆధారం. ఆ తరువాత నూటయాభై చొప్పన ప్రతినెలా పంపేవాడు. అలా పదిహేను సంవత్సరాలు పంపించాడు. ఇబ్బందులు పడుతూనేలేజీ చదువులు ముగించాం.

శ్రీ కొత్త సత్యనారాయణ చౌదరి గారికి శ్రీ విశ్వనాథ సత్యనారాయణ గార్కి "రామాయణ కల్పవృక్షం" మీద విమర్శ, ప్రతివిమర్శలు ఆంధ్రప్రతికలో పడుతూ వుండేవి. అర్థం కాక పోయినా ఆసక్తిగా చదివే వాడిని తెలుగు సాహిత్యంతో బి.ఎ. చదవాలని బి.ఏలో చేరితే, తెలుగు సాహిత్యం చదివేవాళ్ళు ఇద్దరో ముగ్గురో వున్నారని నన్ను బలవంతంగా ఆంగ్ల సాహిత్యం తీసుకొమ్మని చెప్పారు.

ఆఫీసులో ఫైళ్ళు ఇంగ్లీషులో రాస్తున్నా తెలుగు సాహిత్యంలో అనుబంధం వొగులు కోలేదు. ఏదొక పుస్తకంలో మునక వేస్తుంటే మనస్సుకు హాయినిస్తుంది. సాహితీ మిత్రులు కథా రచయిత అవధానుల సుధాకరరావు, ప్రముఖ నాటక రచయిత చిలుకూరి వెంకటప్పయ్య గారితో సచివాలయంలో వీలుదొరికినప్పడల్లా కథలు, నవలల గూర్చి

లేగదూడ మెడలో రంగు పూసల దండ కడుతున్న మనవడి వైపు ఆపేక్షగా చూశాడు.

"మీ అబ్బాయి సుబ్బయ్య తాతకి అమెరికా నుంచి చేతికర్ర తెచ్చి ఇచ్చాడంట. తెగ మురిసిపోతున్నాడు తాత. నా కేమో చుట్ట వెలిగించుకోవడానికి లైటర్ తెచ్చాడు. నీ కేం తెచ్చాడు మావా?" సాంబయ్య యథాలాపంగా అగిగాడు.

ఆ ప్రశ్న చలమయ్య మనస్సులో అలజడి సృష్టిస్తుందని సాంబయ్యకి తెలియదు.

సాంబయ్య, సుబ్బయ్య తాతకి, రేణుకకు – దాని కూతరు రమకి అమెరికా నుంచి కానుకలు తెచ్చి ఇచ్చాడు ప్రసాద్. మరి తనకు ఏం తీసుకురాలేదేం? తనంటే అంత నిర్లక్ష్యమా?

కనీసం మేలురకం చుట్ట తీసుకొచ్చి 'ఇదిగో నాన్నా ! నీ కోసం అమెరికా నుంచి తీసుకొచ్చాను' అని వాడంటే ఎంత సంతోషపడేవాడు. పట్టుమని పది నిముషాలు తనతో మాట్లాడటానికే వాడికి తీరిక దొరకదు. ఊళ్లో వాళ్లందరిని చుట్టబెట్టుకుని వస్తాడు. అందరూ వాడిని మెచ్చుకునేవాళ్లే !

'మీ నాన్న కష్టపడి నిన్ను చదివిస్తే ఆయనకు చెప్పకుండా పెళ్ళి చేసుకున్నావ్ ! తల్లిదండ్రులను చూడటానికి ఎనిమిదేళ్ల తరువాత వస్తావా? ఊళ్లో చాలా మందికి ఏవేవో కానుకలు తెచ్చి ఇచ్చావుగదా! మీ నాన్నను కూడా గుర్తు ఉంచుకుని ఏదొక వస్తువు తెస్తే ఎంత బాగుండేది? అని ఒక్కరూ కొడుకును మందలించరే!' అనుకున్నాడు మనస్సులో చలమయ్య.

"ప్రసాద్ నిన్న మనవూరి సర్పంచ్‌తో మాట్లాడేడట. ఊళ్లో స్కూలు పెట్టించడానికి నాలుగు లక్షల విరాళం కూడా ఇస్తాడట. ఊళ్లో అందరూ మీ వాడి గూర్చి గొప్పగా చెప్పుకుంటూ ఉన్నారు" అన్నాడు సాంబయ్య.

చిట్టి పీపాలో పండేసిన బొప్పాయికాయలు బయటకు తీసి ముక్కలు కోసి పంచదార చల్లి అందరికీ ప్లేట్లలో తెచ్చి పెట్టింది.

బొప్పాయి ముక్కలు ఇష్టంగా తిన్నాడు మణిదీప్. పల్లెటూరి చిరుతిళ్లు బాగా నచ్చాయి వాడికి. నాయనమ్మ చేసిపెట్టే బెల్లపప్పుచ్చులు, సున్నిఉండలు, నేతిగారెలు చాలా ఇష్టం వాడికి. తాతయ్య తెచ్చి ఇచ్చే పండిన బాదంకాయలు, సీమ చింతకాయలు, భూమిలో పాతిపండేసిన ఈతకాయలంటే ఇష్టం వాడికి.

సాంబయ్య ఎళ్లపోయాక, బసవమ్మ పశువుల సావిడికేసి వచ్చినప్పుడు మెల్లగా అడిగాడు చలమయ్య.

"ఊళ్లో అందరికీ బహుమానాలు పట్టుకొచ్చేదు గదా నీ కొడుకు. నీకేం తెలీదా?"

"ఎవరన్నా వింటే నవ్వుతారు. మనకు వాడు బహుమానాలు తీసుకురావడం ఏమిటి? మనవడిని తీసుకొచ్చాడుగా" అంది బసవమ్మ పొయ్యి రాజేయ్యడానికి వరిగడ్డి చిన్నచుట్ట చుట్టుకుంటూ.

"మనవడు ఎన్నిరోజులుంటాడే మనింట్లో? ఓ నెల రోజులు మనల్ని మురిపించి అందరూ వెళ్లిపోతారు. మళ్లీ ఎప్పుడో పదేళ్లకో, పన్నెండేళ్లకో ఊడిపడతారు మళ్లీ మనల్ని ఏడిపించడానికి" అన్నాడు చలమయ్య దిగులుగా.

"పోనీ మనం ఓ పనిచేస్తే...? కొడుకు, కోడలు గొడవ చేస్తున్నారు వాళ్ల దగ్గర కొచ్చేయ్యమని... ఐదారు తరాలు తిన్నా తరగని డబ్బు సంపాదించారట. ఏ లోటు లేకుండా మనల్ని చూస్తారు. వాళ్లతో పాటే వెళ్లిపోదామా? ఏ విషయం ముందు చెబితే మన అమెరికా ప్రయాణానికి అబ్బాయి ఏర్పాటు చేస్తాడట" అంది బసవమ్మ.

ఆ ఆలోచనలో పడిపోయాడు.

చలమయ్య మౌనంగా ఉండిపోవడం చూసి మనవడు, కొడుకుతో పాటే అమెరికా వెళ్లడానికి భర్త సుముఖంగానే ఉన్నా డనుకుంది బసవమ్మ.

వంట చేయడానికి లోపలికి వెళ్లిందామె. వ్యవసాయం, పశువుల్ని వదిలేసి కొడుకుతో వెళ్లాలా? వద్దా? సందిగ్ధంలోఈ పడిపోయాడు చలమయ్య.

ఏమీ పాలుబోక ఊరంతా కలయతిరిగాడు.

చెరువు గట్టు మీద కూర్చున్నాడు కొంత సేపు.

పొలాలకి అడ్డంపడి అరటి తోట దగ్గర కెళ్లాడు.

"మమ్మల్ని వదిలేసి వెళ్లపోతావా?" చుట్టూ కనిపిస్తున్న చెట్టు, చేమ తనని నిలదీసి అడుగుతున్నట్లనిపించింది. చలమయ్య ఇంటికి తిరిగొచ్చేసరికి బాగా పొద్దుపోయింది.

☆ ☆ ☆

వేపపుల్లతో పళ్లు తోముకుంటున్న చలమయ్య దగ్గర కొచ్చి నిలబడింది మాధురి.

"మీరూ మాతో పాటు వచ్చేయ్యండి మామయ్యగారూ!" అడిగిందామె.

తల అడ్డంగా తిప్పాడు రానన్నట్లు.

"ఎనిమిదేళ్లు మేం రాకపోయేసరికి మా మీద కోపం వచ్చిందా మామయ్యా ! నాలుగైదు సార్లు ఇండియా రావాలని బయల్దేరాం. టిక్కెట్లు కూడా తీసుకున్నాం. మా అమ్మ, నాన్న అమెరికాలోనే ఉంటున్నారు మీకు తెలుసు కదా ! ఒకసారి మేం బయల్దేరే సమయానికి మా అమ్మకి గుండెనొప్పి వచ్చింది. మరోసారి యాక్సిడెంట్‌లో మా నాన్న కాలు విరిగింది. దాంతో మా ప్రయాణం ఆగిపోయింది. మీరూ మాతో పాటే వచ్చెయ్యండి మామయ్యగారూ!" అందామె.

నోట్లో ఉన్న వేప పుల్ల విసిరేశాడు.

"అదిగో అటు చూశావా... అదేమిటో తెలుసా?" పశువుల సావిడికి ఎదురుగా ఉన్న చిన్న మట్టి దిబ్బకేసి వేలెత్తి చూపిస్తూ.

పరీక్షగా మట్టి దిబ్బ కేసి చూసింది మాధురి.

పాత నాగలి మట్టిలో కూరుకుపోయి ఉంది. పూర్తిగా శిథిలమైపోయి ఉంది నాగలి కర్ర. నాగలిపై పేరుకున్న మట్టి మీద చిన్న చిన్న మొక్కలు మొలిచాయి. గడ్డిపూలు అందంగా తలలూపుతూ కనిపించాయి.

"ఆ నాగలి మా నాన్న వాడిందమ్మా. అ నాగలి పనికిరాకుండా పోయాక దాన్ని నరికి ముక్కలుగా చేసి వంట చెరుకుగా ఉపమోగించడానికి మనస్సు ఒప్పక మట్టిదిబ్బ మీద పడేశాను. ఆ నాగలిపై పేరుకున్న మట్టి మీద మొలిచిన చిన్న చిన్న మొక్కలు, గడ్డిపూలు చూస్తుంటే మా నాన్నే కళ్ల ముందు మెదులుతుందమ్మా ! ఈ గడ్డ మీదే మేం పుట్టాం. ఇక్కడే ఈ మట్టిలోనే మా బతుకులు కలిసిపోవాలమ్మా!" అన్నాడు చలమయ్య ఉద్వేగంగా.

చలమయ్య మనస్సేమిటో అర్థమయింది మాధురికి.

ఇంటి ముందు కారొచ్చి ఆగింది.

వెళ్లొస్తామని తండ్రికి చెప్పి కారు దగ్గర కొచ్చి నిలబడ్డాడు ప్రసాద్. అత్తగారికి, మామగారికి పాదాభివందనం చేసి ప్రసాద్ ప్రక్కన నిలబడింది.

వసారాలో మాట పలుకు లేకుండా కూర్చున్నాడు చలమయ్య.

బత్తాయికాయ తెచ్చి తాత వొడిలో వేసి "తాతయ్య ఒలిచిపెట్టు" అన్నాడు మణిదీప్.

"మీ అమ్మా నాన్న వెళ్తున్నారు. వెళ్లి కార్లో కూర్చో ! బత్తాయి ఒలిచి పెట్టే సమయం ఎక్కడిది?" అతికష్టం మీద గొంతు పెగల్చుకుని అన్నాడు.

"నేనను అమెరికా వెళ్లడం లేదుగా... మీ దగ్గరే ఉంటున్నాను. ఇక్కడే బుద్ధిగా చదువుకుని, తాతయ్యని, నాయనమ్మని ఏడిపించకుండా ఆడుకొమ్మని మా నాన్న చెప్పాడు" అన్నాడు మణిదీప్ ఉషారుగా.

చలమయ్య హృదయం గుమ్మపాలు చివరి అంచువరకు నిండిన కుండే అయ్యింది.

పై పంచె తలకు చుట్టుకుని దర్పంగా అడుగులు వేసుకుంటూ కారు దగ్గరకు వచ్చాడు.

మాధురి తల నిమిరాడు.

"గొప్ప మనస్సమ్మా నీది? నా కొడుకును ఎనిమిదేళ్లు నాకు దూరం చేసి శిక్ష విధించావనుకున్నాను. నీ కొడుకును నా దగ్గర వదిలి ఇప్పుడు నీకు నువ్వే శిక్ష విధించుకున్నావ్."

కొడుకు దగ్గర కొచ్చి భుజం నిమిరాడు.

"నువ్వు ఆమెరికా నుంచి వస్తూ నాకేం కానుక తేలేదని మధన పడింది. అపురూపమైన కానుకనే నా దగ్గర వదిలి వెళ్లున్నావ్. నీ కొడుకు ఎంతవరకు చదువుతానంటే అంతవరకు వ్యవసాయానికి ఉపయోగపడే చదువు చదివించి ప్రయోజకుడిని చేస్తానురా ... నా మాట నమ్ము" అన్నాడు గంభీరంగా.

చిరునవ్వు నవ్వుతూ కారెక్కి కూర్చున్నారు మాధురి, ప్రసాద్‌లు.

కారు కదిలింది.

మరో పది నిముషాలకి ఆకాశం మేఘావృతమై భూమి మీద చిరుజల్లులు పడ్డాయి. మరో క్షణం ఎండ కాసింది.

తూర్పు దిక్కున ఆకాశంలో హరివిల్లు విరిసింది.

తాత, మనవడు తన్మయత్వంతో హరివిల్లు చూస్తూ ఉండిపోయారు. *

**(ఆంధ్రప్రభ పత్రిక - 21-6-1995)**